తర్వాత అది వధువు నడుముకి కడతారు. అలాగే వధువునడుము మీది బట్ట వరునికి కడతారు. వధువు కూడా తల్లికి కనకాంజలి ఇచ్చి వేదిక మీదికి వస్తుంది. తండ్రి ఒక్కడే కుమార్తెని అల్లునికి చేతిలో చెక్క పెట్టి దర్భలతోకట్టి కన్యాదానం చేస్తాడు. ఆ సమయంలో వధువు చేతికి వసువుదారానికి 7 మామిడాకులతో కట్టిన తోరాన్ని కడతారు. (దీన్ని 'ఆషాడ సుత్రా' అంటారు) అది అయిన తర్వాత వధువు ఇంట దేవునిగదిలో బియ్యం, చెక్క—దేవునిమీద వేయించి (మంగళా ర్పణ) అత్తవారింటికి తీసుకువెళ్తారు. అన్న మాత్రం వెళ్తాడు. అత్తవారింట మళ్ళీ వివాహపు తంతు అంతా ('చౌటకర్మ' అంటారు) 4రోజుల పాటు పాటిస్తారు. ఆ నాలుగు రోజులు వారి చేత స్నానం చేయించరు. నమస్కారం చేయించరు. శివపార్వతులతో సమాన మంటారు. నూతన వస్త్రాలే కట్టుకుంటారు. ఆ తర్వాత వరుని తల్లి కాళ్ళమీద ముందువైపు వరుడు, పాదాల వద్ద వధువు కూర్చుంటారు. వధువుచేతిలో మినుములు, బియ్యంపోసి వెనక్కి 7 సార్లు విసరమంటారు. అవి భర్త తలమీంచి అత్తగారి తలమీంచి వెనక్కి పడతాయి.

---

మీరు వుంటున్న ప్రాంతాలలో ఆంధ్రేతరుల ఆచార వ్యవహారాలు, వివాహ సంప్రదాయాలు, చిత్రమైన కట్టుబాట్లు వంటివి కొన్ని ఇతర ప్రాంతీయులకు వింతగాను, విచిత్రంగాను, ఆసక్తిదాయకంగానూ వుండవచ్చును. వాటి గురించి క్లుప్తంగా, అరఠావు సైజులో ఒక పేజీకి మించకుండా రాసి, (వీలైతే తెలుపు-నలుపు ఫొటోలతో) 'ఇరుగు-పొరుగు' శీర్షికకు పంపించండి. ప్రచురితమైన ప్రతి రచనకూ పారితోషికం వుంటుంది.

---

పితృదేవతలకి వధువు చేత వండించి పిండప్రదానం చేస్తారు. ఆ నాలుగు రోజులు వధూవరులచేత గవ్వలాట ఆడిస్తారు. ముందు వంటయింటిలోనికి అడుగు పెట్టిన పుడు అడుగడుక్కి తమలపాకులు వేస్తారు. వధువు మళ్ళా తన పుట్టినింటికి భర్తవెళ్తే కానీ వెళ్ళ కూడదు. వివాహం తర్వాత అల్లుడు వచ్చినప్పుడు అత్తగారు దీపంతో ఎదురువచ్చివసువు నీళ్ళతో కాళ్ళు కడిగి నూటు, బూటు ఇచ్చి ఆహ్వానిస్తారు. వివాహ సమయంలో అన్నీ ధోవతులే పెడతారు. అప్పుడు జోళ్ళు కూడా ఇవ్వరు. రెండవసారి వచ్చినప్పుడు మాత్రమే అవి ఇస్తారు. అత్తవారింట 4 రోజుల పండగపూర్తికాగానే చేతి తోరాన్ని ఆడబడుచుకాని, మరిది కాని విప్పుతారు. వివాహానికి వచ్చిన పెద్దలకి వధువుచేత కొబ్బరికాయ, చెక్క (పోకచెక్క) ఇప్పిస్తారు.

—పి.వి.సుబ్బలక్ష్మి, బలంగీర్
(ఒరిస్సా)

# పెళ్ళి కథ

## "పాపం! కిషన్"

"ఏమిరా ఆ విజయనగరం అమ్మాయి వాళ్ళకు ఏమని రాయమంటావు ఉత్తరం? చూసివచ్చి ఇన్ని రోజులయింది. ఎంతకూ నీ ఆలోచన తెగకపోతే ఎలా? వాళ్ళకూ పాపం ఆత్రుతగా వుంటుంది కదా?" అంటూ క్రిష్ణవేణమ్మ కొడుకుని అడిగింది.

"అమ్మా ఎన్నిసార్లు చెప్పినా నీకు అర్థం కాదా? నాకు 'రేఖ' ముక్కులాంటి ముక్కు, భానుప్రియ కళ్ళులాంటి కళ్ళు, జయప్రదలా నాజూకుగా, జయసుధ నోరు లాంటి చిన్న నోరు వుండే అమ్మాయేకావాలి. కాబట్టి నచ్చలేదని వాళ్ళకు కార్డురాసి పడేయ్" అన్నాడు కిషన్ నిర్లక్ష్యంగా.

"మరీ అంత పట్టుదల అయితే ఎలారా? నువ్వు చెప్పినట్టుగా వుండే అమ్మాయి దొరికే లోపల నువ్వు క్రికెట్టులో వందసార్లు పరుగెత్తే ఏదో అంటారే అది కొట్టేలా వున్నావు. ఇంతకూ నీకు పెళ్ళయ్యే రాత వుందో లేదో" అని నిట్టూర్పు విడిచారు క్రిష్ణవేణమ్మ.

"సెంచరీ కొట్టినా సరే నాకు మాత్రం అలాంటి అమ్మాయే కావాలి" అని మొండిగా సమాధానం ఇచ్చాడు కిషన్.

కొన్నేళ్ళు గడిచాయి. బెండకాయలా కిషన్ కూడా ముదిరిపోయాడు. అయినా ఆలోచనలలో మార్పులేదు. ధోరణీ మారలేదు. కానీ, కొన్ని రోజులకు కిషన్ కోరుకున్నట్టుగా వున్న అమ్మాయిని చూడటం, అక్కడే, అప్పుడే ఓ.కె. అనడం జరిగింది. కానీ అమ్మాయివైపు వారు మళ్ళీ ఉత్తరం రాస్తామన్నారు. ఊరికి వచ్చాక కిషన్‌లో ఆత్రుతా, ఆందోళనా పోటీపడసాగాయి. అప్పుడర్థమయింది—ఇన్నేళ్లూ తను ఎంతమంది అమ్మాయిలను ఈ రకమైన ఆందోళనకు గురిచేశాడో? కానీ అలా చేసినందుకు మాత్రం పశ్చాత్తాప పడలేదు.

కిషన్ కుటుంబసభ్యులు మూడు నాలుగుసార్లు కబురుపంపిస్తే చివరికి అమ్మాయి తండ్రినుంచి జవాబు వచ్చింది.



"మా అమ్మాయి అమితాబ్ బచ్చన్‌లా పొడవుగా, ధర్మేంద్రలా అందంగా, అమోల్‌పాలేకర్‌లా అమాయకమైన ముఖంతో, శోభన్‌బాబు ముక్కులాంటి ముక్కు గలవాడినే చేసుకుంటుందిట. కనుక క్షమించండి." ఇదీ ఆ ఉత్తరం సారాంశం!

—భాస్కర భారతీదేవి